

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



అద్భుతం.. మనోల్లాసం

ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలోని పార్కు ఆహ్లాదం పంచుతూ మనోల్లాసం కలిగిస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
37.9°/24.1°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

వైఎస్సార్‌సీపీకి 42.15 శాతం ఓట్లు

- జిల్లాలో టీడీపీ అభ్యర్థులకు 8.89 లక్షల ఓట్లు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు 6.98 లక్షల ఓట్లు
- ఇరుపార్టీలకు ఓట్ల వ్యత్యాసం 1.90 లక్షలు



పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 42.15 శాతం ఓట్లు పోలయ్యాయి. టీడీపీకి 53.59 శాతం వచ్చాయి. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 20,18,162 ఓట్లు ఉండగా 16,36,648 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఈవీఎం ఓట్లు 6,90,727 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 7,598 మొత్తం 6,98,325 ఓట్లు (42.15 శాతం) వచ్చాయి. ఇక టీడీపీ అభ్యర్థులకు ఈవీఎం ఓట్లు 8,74,061, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 15,058 మొత్తం 8,89,119 ఓట్లు (53.59 శాతం) వచ్చాయి. ఇరు పార్టీల మధ్య 1,90,794 ఓట్లు (11.43 శాతం) వ్యత్యాసం ఉంది.

వైఎస్సార్‌సీపీ పోస్టల్ బ్యాలెట్లు 32.5 శాతం

మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో వైఎస్సార్ సీపీకి 32.5 శాతం ఓట్లు, టీడీపీకి 64.4 శాతం ఓట్లు, ఇతరులకు 3.1 శాతం వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 23,385 పోలయ్యాయి. ఇందులో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు 7,598 (32.5 శాతం) ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థులకు 15,058 (64.4 శాతం) ఓట్లు, ఇతరులకు 729 (3.1 శాతం) ఓట్లు వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే 32.5 శాతం ఉద్యోగులు వైఎస్సార్ సీపీ వైపు నిలిచారు.

నోటాకు 13,469 ఓట్లు

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఏ ఒక్కరికీ ఓటు వేయడం ఇష్టం లేని వారు నోటా (పై ఎవరూ కాదు) బటన్‌పై నొక్కుతారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో అలాంటి నోటా ఓటు శాతం 0.81గా నమోదు కావడం గమనార్హం. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 113 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరికి ఓటు వేసేందుకు 13,469 మంది ఇష్టపడలేదు. దీంతో వీరంతా తమ ఓటును నోటాకు వేశారు. ఇందులో ఈవీఎంలో ఓటు వేసిన వారు 13,278 మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన వారు 191 మంది ఉన్నారు.

మొత్తం ఓట్లు	20,18,162
పోలైన ఓట్లు	16,36,648
టీడీపీకి పోలైన ఈవీఎం ఓట్లు	8,89,119
టీడీపీకి పోలైన పోస్టల్ బ్యాలెట్లు	15,058
టీడీపీ ఓట్ల శాతం	53.59
వైఎస్సార్‌సీపీకి పోలైన ఈవీఎం ఓట్లు	6,98,325
వైఎస్సార్‌సీపీకి పోలైన పోస్టల్ బ్యాలెట్లు	7,598
వైఎస్సార్‌సీపీ ఓట్ల శాతం	42.15

రాయదుర్గంలో అత్యధికం

సార్వత్రిక ఎన్నికల్లో 8 నియోజకవర్గాల పరిధిలో నోటాకు వచ్చిన ఓట్లు పరిశీలిస్తే... అత్యధికంగా రాయదుర్గం నియోజకవర్గంలో ఈవీఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 2,370 ఓట్లు వచ్చాయి. అదే విధంగా అనంతపురంలో 1,379 ఓట్లు, గుంతకల్లులో 1,743 ఓట్లు, కళ్యాణదుర్గంలో 1,450, రాప్తాడులో 1,706, శింగనమలలో 1,906 , తాడిపత్రిలో 1,000, ఉరవకొండలో ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలిపి 1,915 ఓట్లు నోటాకు వచ్చాయి.

వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఓట్లు..

నియోజకవర్గం	ఈవీఎం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్	మొత్తం	శాతం
అనంతపురం	78,273	2,038	80,311	42.36
గుంతకల్లు	93,856	1,018	94,874	45.89
కళ్యాణదుర్గం	80,353	791	81,144	39.42
రాప్తాడు	91,538	1,273	92,811	42.74
రాయదుర్గం	88,165	485	88,650	38.84
శింగనమల	93,551	618	94,169	45.22
తాడిపత్రి	85,245	779	86,024	42.42
ఉరవకొండ	79,746	596	80,342	41.30
మొత్తం	6,90,727	7,598	6,98,325	42.15

టీడీపీకి వచ్చిన ఓట్లు ఇలా...

నియోజకవర్గం	ఈవీఎం ఓట్లు	పోస్టల్ బ్యాలెట్	మొత్తం	శాతం
అనంతపురం	99,062	4,272	1,03,334	54.51
గుంతకల్లు	99,952	1,748	1,01,700	49.19
కళ్యాణదుర్గం	1,17,364	1,514	1,18,878	57.75
రాప్తాడు	1,13,734	2,406	1,16,140	53.48
రాయదుర్గం	1,29,307	1,002	1,30,309	57.09
శింగనమల	1,01,779	1,178	1,02,957	49.44
తాడిపత్రి	1,12,313	1,442	1,13,755	54.77
ఉరవకొండ	1,00,550	1,496	1,02,046	52.46
మొత్తం	8,74,061	15,058	8,89,119	53.59

న్యూస్‌రీల్

ప్రజల పక్షాన పోరాడతాం

- మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ నారాయణ

అనంతపురం కార్పొరేషన్: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఎన్నికల ఫలితాలు ఎంతో బాధ కలిగించినా.. రానున్న ఐదేళ్ల పాటు ప్రజల పక్షాన రాజీ లేని పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారన్నారు. రూ.2.50 లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో వేసి ఆదుకున్నారన్నారు.గత ఐదేళ్లలో ఊహకందని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. పథకాల లబ్ధి చేకూర్చడంలో ఎక్కడా అవినీతికి చోటివ్వలేదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఏ అవసరమొచ్చినా అందుబాటులో ఉంటామన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. అబద్ధపు హామీలే టీడీపీని గెలిపించాయన్నారు. త్వరలోనే వారి మోసం బహిర్గతమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల కోసం ఎన్నికల్లో శ్రమించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి బుధవారం ఇన్‌ఫ్లో పెరిగింది. గత శనివారం 270 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో.. డ్యాం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో బుధవారం 517 క్యూసెక్కులకు చేరింది. ప్రసుతం డ్యాంలో 1,577.82 అడుగుల నీటి మట్టంతో 3.500 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాయబసవన కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతేడాది రిజర్వాయర్‌లో ఇదే సమయానికి 1,581.04 అడుగుల వద్ద 5 టీఎంసీల నీరు ఉండేవి. ఇన్‌ఫ్లో 889 క్యూసెక్కులుగా ఉండింది. నైరుతి పవనాల ప్రభావంతో ఆగస్టు 15 వరకూ వర్షాలు కురిసే అవకాశాలుండడంతో త్వరలో ఇన్‌ఫ్లో మరింత పెరిగి డ్యాం నిండవచ్చని టీబీ బోర్డు అధికారులు తెలిపారు.

అదనంగా విత్తన వేరుశనగ సరఫరాకు ప్రతిపాదన



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు అదనంగా 12,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేయాలంటూ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. 67,500 వేల క్వింటాళ్ల కోసం దాదాపు 72 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. బుధవారం నాటికి 56,500 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందన్నారు. జిల్లాకు 76 వేల క్వింటాళ్లు కేటాయించగా, నైరుతి రుతపవనాల ప్రభావంతో వర్షాలు పడుతున్నందున విత్తన వేరుశనగ మరింత అవసరమని పలు మండలాల నుంచి ప్రతిపాదనలు రావడంతో అదనంగా 12,500 క్వింటాళ్లు కావాలని కోరామన్నారు. అనుమతులు రాగానే ఏపీ సీడ్స్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. మరోవైపు ఆర్‌బీకే వేదికగా వేరుశనగతో పాటు కందులు, రాగులు, కొర్రలు, మినుము, పెసలు, పచ్చిరొట్ట విత్తనాలకు రిజిస్ట్రేషన్లు సాగుతున్నట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో వాటిని కూడా పంపిణీ చేస్తామన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న గస్తీ



పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లిలో పోలీసులు

అనంతపురం: ఎన్నికల ఘట్టం ముగిసినా, గ్రామాల్లో ప్రశాంతతకు భంగం తలెత్తకుండా మొబైల్ పార్టీలు, పెట్రోలింగ్ పార్టీలు గస్తీ కొనసాగిస్తున్నాయి. జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు భద్రతను పటిష్టం చేశారు. గొడవలు, అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కట్టడి చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ అనుకుంటే బండరాయి వచ్చింది!

- ఆరు రోజుల క్రితం సమగ్ర శిక్ష కార్యాలయానికి కొరియర్
- ప్యాకింగ్ ఓపెన్ చేసి కంగుతిన్న ఉద్యోగులు



ప్యాకింగ్‌లో వచ్చిన బండరాయి

అనంతపురం ఎడ్యుకేషన్: కొరియర్‌లో ల్యాప్‌టాప్ వచ్చిందనుకుంటే బండరాయి కనిపించిన సంఘటన నగరంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల సమగ్ర శిక్ష డీపీసీ, ఏపీసీలకు హెచ్‌పీ కంపెనీ 12 జనరేషన్, 16 జీబీ ర్యామ్, 1టీబీ ఎస్ఎస్‌డీ, స్క్రీన్ విండోస్ 11 ప్రో, ఎంఎస్ ఆఫీస్ అడాప్టర్ క్యారీ కేస్ సామర్థ్యం కల్గిన ల్యాప్‌టాప్స్ కొనుగోలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కంప్యూటర్ ఇండియా అనే సంస్థ ఈ ల్యాప్‌టాప్స్‌ను సరఫరా చేసింది. మే 31న జిల్లాకు వచ్చాయి. డీపీసీగా ఉన్న డీఈఓ తనకు అందిన ప్యాకింగ్ ఓపెన్ చేయగా, ల్యాప్‌టాప్ ఉంది. ఈ క్రమంలోనే జిల్లాకు పంపిన రెండు ల్యాప్‌టాప్‌ల్లో ఒకదానిని అందుకున్నట్లు సమాచారం పంపారని, రెండో దాని వివరాలు పంపాలంటూ బుధవారం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. దీంతో సమగ్ర శిక్ష ఏపీసీకి వచ్చిన పార్శిల్‌ను ఓపెన్ చేయగా.. అందులో బండరాయి దర్శనం ఇచ్చింది. ఆ రాయికే కవర్లు కప్పి ఉంది. అందులోనూ దాదాపు ల్యాప్‌టాప్ బరువు ఏ మేర ఉంటుందో అంతేస్థాయి బరువున్న రాయి ఉంచారు. ఏమాత్రం అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే, ఈ విషయాన్ని వెంటనే రాష్ట్ర కార్యాలయ అధికారుల దృష్టికి స్థానిక సిబ్బంది తీసుకెళ్లారు. ల్యాప్‌టాప్ పార్శిల్ కవరుపై ఉన్న కంప్యూటర్ ఇండియా సంస్థ ఫోన్ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

బాగా పని చేశాం.. స్ఫూర్తి కొనసాగిద్దాం

- ఎస్పీ గౌతమి శాలి



కార్యక్రమానికి హాజరైన పోలీసులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం: 'కౌంటింగ్ ప్రశాంతంగా ముగియడంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. అందరూ బాగా పనిచేశారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిద్దాం' అని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో బుధవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అన్ని వర్గాల ప్రజలకూ కృతజ్ఞతలు తెలిపారు. కౌంటింగ్ బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర బలగాల కృషి ప్రశంసనీయమన్నారు. అందరూ సమష్టిగా పని చేయడంతోనే కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. పోలింగ్ తర్వాత తలెత్తిన ఘర్షణలు, అల్లర్ల వల్ల అందరి దృష్టి జిల్లాపై పడిందని, ఈ క్రమంలోనే అదనంగా బలగాలు వచ్చాయన్నారు. కౌంటింగ్ రోజున జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ ఘటనలు తలెత్తే అవకాశం ఉంటుందని అందరూ భావించారని, అయితే అలాంటి వాటికి చోటివ్వకుండా ప్రశాంతంగా ముగించామన్నారు. అందరూ చిత్తశుద్ధితో పనిచేయడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఇలాగే మరిన్ని రోజులు శ్రమించి జిల్లాను ప్రశాంతంగా ఉంచుదామని పిలుపునిచ్చారు.

ప్రశాంత వాతావరణంలో జీవించండి

ఆత్మకూరు: గ్రామీణులు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. బుధవారం మండలంలోని బి. యాలేరు, మదిగుబ్బ గ్రామాల్లో ఆమె పర్యటించారు. స్పెషల్ పార్టీ పోలీసులతో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ అల్లర్లకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ కలసిమెలసి ఉండాలని హితవు పలికారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, మండల ఎస్ఐ మునీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

చిరుజీవులు ఛిద్రం

- రాకెట్ల వద్ద రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఇద్దరి దుర్మరణం



మృతి చెందిన నాగభూషణం, హనుమక్క(ఫైల్)



నుజ్జునుజ్జయిన ఆటో

ఉరవకొండ: వారు చిరుజీవులు. రోజూ గ్రామాల్లో కూరగాయలు విక్రయిస్తూ వచ్చే ఆదాయంతో పొట్ట పోసుకుంటున్నారు.అలాంటి వారిని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని రాకెట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన మేరకు.. రాకెట్ల గ్రామానికి చెందిన నాగభూషణం (55), హనుమక్క (60) రోజూ ఆటోలో కాయగూరలు తీసుకెళ్లి గ్రామాల్లో విక్రయిస్తుంటారు. బుధవారం కూడా రోజూ మాదిరిగా బయలుదేరారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలో కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన నాగభూషణం, హనుమక్క అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని 108 వాహనంలో మృతదేహాలను ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగభూషణానికి భార్య కవితతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. హనుమక్కకు ముగ్గురు కుమారులున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే అందరూ ఘటనాస్థలికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. నాగభూషణం మృతదేహం వద్ద భార్య, కుమారులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేశారు.

రెండో రోజూ టీడీపీ దాడులు

విజయోత్సాహంలో రెండో రోజూ టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యాలకు దిగారు. జిల్లాలోని పలు చోట్ల వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై దాడులు చేశారు. వీరి స్వైరవిహారంతో జనం వణికిపోయారు.

బొమ్మనహాళ్: రాయదుర్గం ఫలితాలు వెలువడిన కొద్దిసేపటికే బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వీరవిహారం చేశారు. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నుంకేష్ ఇంటిపై దాడులకు తెగబడ్డారు. వీరి దాడిలో నుంకేష్ తల్లి మంగళమ్మ తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు ఆమెను బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే సింగానహళ్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవన్నపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. టీడీపీ కార్యకర్తల స్వైరవిహారంతో ఆయా గ్రామస్తులు హడలిపోయారు.



బొమ్మనహాళ్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంగళమ్మ



పుట్లూరు మండలం బాలాపురం సచివాలయం వద్ద శిలాఫలకాన్ని పగులగొట్టిన దృశ్యం

ఉప సర్పంచ్, భార్యపై దాడి

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వన్నప్ప ఇంటిపై బుధవారం కొందరు టీడీపీ నాయకులు దాడులకు దిగారు. ఇంట్లో ఉన్న ఉప సర్పంచ్ వన్నప్పపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. అడ్డుకోబోయిన ఆయన భార్యపై కూడా దాడికి యత్నించారు. బాధితుడి సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేసుకుని వివరాలు సేకరించారు.

కో ఆప్షన్ సభ్యుడి ఇంటిపైకి రాళ్లు..

ఉరవకొండకు చెందిన వైఎస్సార్‌సీపీ మండల కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీం ఇంటిపైకి కొంతమంది ఆకతాయిలు రాళ్లు విసిరారు. దీంతో సలీం ఇంటి తలుపులు, అద్దాలు పగిలిపోయాయి. తాను, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో రాళ్ల దాడి జరిగిందని, దీంతో ప్రమాదం నుంచి తప్పించుకోగలిగామని సలీం తెలిపాడు.

శిలాఫలకాల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

పుట్లూరు: ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పుట్లూరు, బాలాపురం గ్రామ సచివాలయాల వద్ద శిలాఫలకాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. మద్యం మత్తులో ఈలలు, కేకలు వేసుకుంటూ శిలాఫలకాలను సుత్తితో ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఆయా గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎస్ఐ హేమాద్రికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త బైకుకు నిప్పు



టీడీపీ కార్యకర్తలు నిప్పు పెట్టడంతో దగ్ధమైన అశోక్ రెడ్డి బైకు

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ కార్యకర్త బైకుకు టీడీపీ కార్యకర్తలు నిప్పు పెట్టిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో జరిగింది. బుధవారం తెల్లవారుజామున బ్రాహ్మణపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అశోక్ రెడ్డి బైకుకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. బాధితుడు రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి టీడీపీ కార్యకర్తలు ఖలీల్, ఖాదర్‌లపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

- వైఎస్సార్ సీపీ నాయకులపై రెచ్చిపోయిన వైనం



దుండగులు ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం

వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

రొద్దం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం జిల్లా వ్యాప్తంగా అలజడులు రేగాయి. మంగళవారం రాత్రి రొద్దంలో కొందరు దుండగులు డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహం చేయిని విరగ్గొట్టారు. బుధవారం ఉదయం గుర్తించిన వైఎస్సార్ సీపీ నాయకులు విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

కవితా సంపుటాలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఈ ఏడాది విమలా శాంతి సాహిత్య అవార్డు-24 ప్రదానానికి గాను కవులు, రచయితల నుంచి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతి నారాయణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కవితా సంపుటాను నాలుగేసి కాపీలు చొప్పున ఈ నెల 15వ తేదీ లోపు ×ఉప్పరపాటి వెంకటేశులు, 16–37–1 రాహుల్‌నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం – 5115004₹ అనే చిరునామా పంపాలి. పూర్తి వివరాలకు 97042 29692లో సంప్రదించవచ్చు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

యాడికి: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 30 మందిపై కేసు నమోదు చేసినట్లు యాడికి సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం సాయంత్రం యాడికి, రాయలచెరుడు, కుందనకోట, చందన, లక్ష్ముంపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తొలగించి గ్రామాల్లో హల్‌చల్ చేశారు. ఈ దృశ్యాలు ఆయా గ్రామాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. వీటి ఆధారంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 30 మందిని గుర్తించి ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


దేవన్న (ఫైల్)

బొమ్మనహాళ్: పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్‌కు చెందిన తెలుగు దేవన్న (55)కు భార్య చిత్తమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయనను పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

బాలికల సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో సెలెక్టర్లు

అనంతపురం: ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకూ వెంకటగిరిలో జరిగే అండర్-19 బాలికల సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీకి ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎంపికైనా వారిలో ఎస్.ఆశ్రియ, ఎ.హన్సిరెడ్డి, బి.నందిని, బి.నేహ, బి.అమూల్య, కె.గౌతమి, వీసీ రివ్య, పి.తేజ దీపిక, ఎస్.నాగజ్యోతి, పి.సుమియా తాజ్, పి.సరస్వతి, అంచల్ యాదవ్, సమీనా బేగం, తరుణం, తేజశ్రీ ఉన్నారు. స్టాండ్‌బై కింద హిమర్షిణి, నిత్యారెడ్డి ఎంపికయ్యారు. ఎంపికలను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.మధు ఆచారి పర్యవేక్షించారు.


పంపనూరు సిటీ పార్కు ముఖద్వారం


పార్కులో బొమ్మలతో ఆడుకుంటున్న పిల్లలు


బొమ్మల వద్ద ఫొటోలు దిగుతున్న చిన్నారులు


పార్కులో పర్యటిస్తున్న సందర్శకులు

అద్భుతం.. మనోల్లాసం

- సందర్శకులతో సందడిగా మారిన సిటీ పార్క్

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం సమీపంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిటీ పార్క్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలతో కలసి సరదాగా గడిపేందుకు కుటుంబాలు భారీగా తరలిస్తున్నాయి. ఈ క్రమంలో సిటీ పార్క్‌కు సందర్శకుల తాకిడి మరింత పెరిగింది. ఈ పార్క్‌ను సందర్శించిన వారు ఓ అద్భుతమని వర్ణిస్తున్నారు. మనోల్లాసానికి ఎంతో దోహదపడుతుండడంతో తరచూ తాము ఈ పార్క్‌ను సందర్శిస్తుంటామని పేర్కొంటున్నారు.


ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు

క్యాన్సర్‌నూ నయం చేయిచ్చు


శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారులు

అనంతపురం మెడికల్: ప్రారంభదశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే సరైన వైద్య చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చునని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్ అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై వైద్యులు, సిబ్బందికి అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్యాన్సర్ రోగులకు అందించే అధునాతన వైద్య చికిత్సలపై ఇటీవల ప్రభుత్వ వైద్య కళాశాలలోని కొందరు వైద్యులు విశాఖపట్నంలోని హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందారని గుర్తు చేశారు. వారి ద్వారా ఇక్కడి వైద్యులకు క్యాన్సర్ నివారణ చికిత్సలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గ్రామ స్థాయిలోనే క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించేలా బహుళ, దశల వారీ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యుల తర్వాత డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు, గైనకాలజిస్టు స్పెషలిస్టులకు త్వరలో శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మూడో దశలో మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఉంటుందన్నారు. రొమ్ము, దంత, గర్భాశయ క్యాన్సర్లను గుర్తించడమే లక్ష్యంగా శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర జి.నారాయణస్వామి, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయాల్లోనే డీఎల్

- ఉప రవాణా కమిషనర్ కరుణసాగర్‌రెడ్డి

హిందూపురం అర్బన్: రవాణా శాఖ కార్యాలయాల్లోనే డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేస్తారని శ్రీసత్యసాయి జిల్లా ఉప రవాణా కమిషనర్ కరుణసాగర్‌రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి డ్రైవింగ్ స్కూళ్లలో డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చునంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అంశాన్ని ఆయన ఖండించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.... డ్రైవింగ్ లెసెన్స్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేదంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న అంశం అవాస్తమన్నారు. 2021, జూలై 1న కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని, అయితే ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదన్నారు. ఎల్ఎల్ఆర్, డీఎల్ కోసం స్లాట్ బుక్ చేసుకుని రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించే పరీక్షలకు విధిగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 12ను అనుసరించి ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రైవింగ్ స్కూళ్లకు గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. అక్రిడేటెడ్ ట్రైనింగ్ సెంటర్ గుర్తింపు పొందడానికి రెండు ఎకరాల స్థలం, మీడియం, భారీ వాహనాలకు కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉండాలన్నారు. వీటితో పాటు రెండు తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రాజెక్ట్ సిస్టమ్, బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం, డ్రైవింగ్ ట్రాక్‌లు, డ్యూయల్ కంట్రోల్‌తో ఓ వాహనం, ఇతర మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ పదవికి మాల్యవంతం మంజుల రాజీనామా


రాజీనామా లేఖ చూపుతున్న మాల్యవంతం మంజుల

అనంతపురం క్రైం: ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ పదవికి మాల్యవంతం మంజుల రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఆర్టీసీ ఈడీకి పంపారు. బుధవారం ఆమె అనంతపురంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఆర్టీసీ పురోగతికి ఎనలేని కృషి చేశామన్నారు. ఆర్టీసీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఎన్నేళ్లు గడిచినా ప్రతి ఆర్టీసీ ఉద్యోగి, కార్మికుడి గుండెల్లో జగనన్న ఉంటారని తెలిపారు. జగనన్న అడుగుజాడల్లో తామంతా నడుస్తామని, కష్టకాలంలో అండగా ఉండి పోరాడతామని స్పష్టం చేశారు.

నేటితో ముగియనున్న ఎన్నికల కోడ్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్– ఎంసీసీ) బుధవారంతో ముగియనుంది. మార్చి 16న ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. వెనువెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ జూన్ 6 తేదీ వరకు ఉంటుందని షెడ్యూల్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ముగ్గురి మృతి

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారు. టీవీల్లో ఎన్నికల ఫలితాలను పరిశీలించిన అనంతరం గుండెపోటుకు గురై మృతి చెందారు.


బొమ్మన్న, రామచంద్ర, జూటూరు కిష్టయ్య (ఫైల్)

బ్రహ్మసముద్రం: మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామానికి చెందిన తలారి బొమ్మన్న (62) వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నాడు. మంగళవారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో పార్టీ ఓటమి పాలైనట్లు తెలియగానే ఒక్కసారిగా ఛాతీ పట్టుకుని కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు... బొమ్మన్న మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

- **పెనుకొండ రూరల్:** మండలంలోని మునిమడుగుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ రామచంద్ర (45) పార్టీ ఓటమిని తట్టుకోలేక మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. ఉదయం నుంచి టీవీ వద్దనే కూర్చొని ఎన్నికల ఫలితాలను చూస్తున్న ఆయన సాయంత్రానికి తీవ్ర ఒత్తిడికి లోనయ్యాడు. ఈ క్రమంలో పార్టీ ఓటమిని తట్టుకోలేక బోరున రోదిస్తూ ఒక్కసారిగా ఛాతీ పట్టుకుని కుప్పకూలాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.
- **వజ్రకరూరు:** మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన జూటరు కిష్టయ్య (60) గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీకి వీరాభిమానిగా గ్రామంలో గుర్తింపు పొందిన కిష్టయ్య... మంగళవారం టీవీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలను గమనిస్తూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక రెండు రోజులుగా తీవ్ర మనో వేదనకు లోనయ్యాడు. బుధవారం సాయంత్రం కుటుంబసభ్యులతో మాట్లాడుతూ... ఇక తమకు కష్టాలు తప్పవంటూ ఉన్నఫళంగా ఛాతీ పట్టుకుని కుప్పకూలి మృతి చెందాడు. ఆయనకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్ మెయింటెనర్ల సమస్యలు పరిష్కరించండి

- ఎస్‌సీఆర్ఎంయూ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్, హాజరైన ట్రాక్ మెయింటెనర్లు

గుంతకల్లు: రైల్వే ట్రాక్ మెయింటెనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తక్షణమే పరిష్కారించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్ మెయింటెనర్ల సేఫ్టీ సెమినార్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని ఇంజనీరింగ్ యూనిట్లలో పనిచేస్తున్న ట్రాక్ మెయింటెనర్ల ఇబ్బందులను ప్రస్తావించారు. నైట్ ప్రెటోలింగ్ విధులకు తప్పనిసరిగా ఇద్దరిని కేటాయించాలన్నారు. అంతే కాక వీరికి ఇస్తున్న పనిముట్ల కాలం చెల్లిపోయి ఇబ్బంది పడుతున్నారని, వెంటనే కొత్త వాటిని సమకూర్చాలన్నారు. రైలు పట్టాల పక్కన గుర్తించిన మృతదేహాలకు కాపలాగా ట్రాక్ మెయింటెనర్లను నియమించరాదన్నారు. 8 గంటల పని విధానంతో పాటు బేషరతుగా సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శులు బీఎం బాషా, అశ్విని, జోనల్ నాయకులు శేఖర్‌బాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మస్తాన్‌వలి, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : డీఎఫ్‌ఓ



సిటీ పార్క్‌లో మొక్క నాటి నీరుపోస్తున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, అనంతపురంలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ ప్రజలకు జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) వినీత్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సిబ్బందితో కలసి ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న సిటీ పార్క్‌లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌ను పరిశీలించారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌బీఓ దామోదర్, తేజేశ్వరరెడ్డి, ఏబీఓ రామ్మోహన్ పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 20 చోట్ల 4,600 మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనంతపురం సెంట్రల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో బుధవారం చేపట్టిన గ్రీన్ ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజు, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, ఎకాలజీ సెంటర్ సీఓఓ మురళీకృష్ణ, నగర పాలకసంస్థ ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, డీసీహెచ్ఎస్ రవికుమార్, జిల్లా కోర్టు అధికారి నల్లప్ప, డీసీఎస్ ఆనందభాస్కర్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ పీవీ కిషోర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ విధిగా ఓ మొక్క నాటి పరిరక్షించాలన్నారు. అనంతరం కృష్ణ కళామందిరంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

సిద్దరాంపురంలో...

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురంలో డ్వామా ఆధ్వర్యంలో బుదవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి పాల్గొని మొక్కలు నాటి, మాట్లాడారు. పర్యావరన పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని పిలపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ అనూరాధ, ఏపీఓ పోలేరయ్య, సుజాత, ఈసీ శివ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తాగుబోతు వీరంగం


మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న సాయి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హారతి

పెనుకొండ రూరల్: మండలంలోని గోనిపేటలో ఓ తాగుబోతు వీరంగం సృష్టించాడు. వివరాలు... గ్రామానికి చెందిన వి.సాయి బుధవారం సాయంత్రం మద్యం మత్తులో గ్రామంలో హల్‌చల్ చేశాడు. వారించబోయిన తన చెల్లెలు హారతిపై కత్రతో దాడి చేశాడు. ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. గ్రామ మహిళా పోలీసు వెంటనే జోక్యం చేసుకుని వారించబోవడంతో మరింత రెచ్చిపోయాడు. గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది అడ్డుకోవడంతో వారిపై ఎదురు దాడికి దిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని తాగుబోతును అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రురాలిని పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఒక క్లిక్ దూరంలో ఉద్యోగ అవకాశం!

అనంతపురం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు పెద్దపీట వేసేలా సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. సాంకేతిక వ్యవస్థ సాయంతో జిల్లాలో ఉన్న ఉపాధి కార్యాలయాల స్వరూపమే మారిపోయింది. గతంలో అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు రోజుల తరబడి తిరిగి క్యూల్లో నిలబడి విద్యార్హతల వివరాలను నమోదు చేసుకునేవారు. ఇంతా చేసినా, ఒక్కోసారి ఉద్యోగాల సమాచారం అభ్యర్థికి తెలిసేది కాదు. కానీ, నేడు ఒక్క క్లిక్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది.

ఇంటి నుంచే..

నిరుద్యోగ యువత ఎంప్లామెంట్ రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. https://employment.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నెంబర్, సదరు ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా పొందవచ్చు. ఎంప్లాయిమెంట్ కార్డును సైతం లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. దీంతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డ్ రెన్యువల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు అవకాశం ఉంటుంది.

సులువుగా ఉద్యోగ సమాచారం

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన నోటిఫికేషన్ల సమగ్ర సమాచారం, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీల వివరాలు ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు నేరుగా ఎప్పటికప్పుడు అతి సులువుగా చేరతాయి. విద్యార్హతల ప్రకారం ఉద్యోగాల ఖాళీల వివరాలు యువత ఫోన్ నంబర్, ఈ–మెయిల్‌కు అలెర్ట్ మెసేజ్ వస్తుంది. వీటితో పాటు జాబ్‌మేళా సమాచారం అందిస్తూ యువతకు, ఇటు సంస్థలకు వారధిగా ఉపాధి కల్పన కార్యాలయం నిలుస్తోంది.

ఎన్ఎంఎంఎస్‌కు 209 మంది ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు అనంతపురం జిల్లాకు చెందిన 209 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షకు సంబంధించిన ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. అర్హత సాధించిన విద్యార్థుల మెరిట్ కార్డులను త్వరలో సంబంధిత పాఠశాలలకు పంపనున్నట్లు జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరున తండ్రి లేదా తల్లి పేరుతో జాయింట్ ఖాతా తెరవాలన్నారు. ఈ ఖాతాకు విద్యార్థి ఆధార్ సంబర్‌కు అనుసంధానం చేయాలన్నారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarship.gov.in లో విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ లిస్ట్‌లో పొందుపరిచినట్లుగా ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ నందు ఒక అక్షరం కూడా తేడా లేకుండా ఉండేలా నమోదు చేసుకోవాలన్నారు.

కారు ఢీ - విద్యార్థి మృతి


మృతి చెందిన మంజునాథ

రాయదుర్గం టౌన్: స్థానిక పైతోటలో జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...గుమ్మఘట్ట మండలం వైద్యం గుండ్లపల్లికి చెందిన రామాంజనేయులు కుమారుడు మంజునాథ్ (14) 8వ తరగతి చదువుతున్నాడు. సెలవుల నేపథ్యంలో పైతోటలోని మేనమామ ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి 8 గంటలకు రోడ్డు దాటుతున్న సమయంలో మొలకాల్మూరు వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని జన్మభూమి నగర్, కక్కలపల్లి, కాటిగానికాల్వ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు గురువారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 5వ తేదీ వరకు ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వారికి పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేస్తారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554-246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554-228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

నేడు సాయిబాబా ఆలయంలో పూజలు

రాప్తాడు: స్థానిక షిరిడి సాయిబాబ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారి క్రిష్ణమూర్తి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

22 వేల పాఠ్యపుస్తకాల సరఫరా

కనగానపల్లి: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ అరుణమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి సుమారు 26 వేలు పుస్తకాలు అవసరం కాగా.. ఇప్పటి వరకు 22 వేలకు పైగా పుస్తకాలు కార్యాలయానికి వచ్చినట్లు వెల్లడించారు. వీటితో పాటు విద్యార్థులకు అందించే విద్యా కానుక కిట్లు కూడా ఒక్కొక్కటి కార్యాలయానికి చేరుతున్నట్లు పేర్కొన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కాగానే వీటిని పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందజేస్తామన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంఓ రవిశంకర్

బొమ్మనహాళ్: ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీపీఎంఓ రవి శంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో స్థానిక ప్రజాఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. గోవిందవాడలో గర్భిణీ మృతికి గల కారణాలను మృతురాలి రికార్డు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రఫీయా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

'నీట్'లో మెరిసిన గుత్తి అమ్మాయి



రిషిత రవి త్రయిని

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన రిషిత రవి త్రయిని నీట్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటింది. మొత్తం 720 మార్కులకు గాను 690 మార్కులు సాధించింది. చెట్నేపల్లికి చెందిన రాధిక(స్కూల్ అసిస్టెంట్), రవి (స్కూల్ అసిస్టెంట్) దంపతుల కుమార్తె రిషిత రవి త్రయిని గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మెరీస్ పాఠశాలలో టెన్త్ వరకు చదివింది. టెన్త్‌లో మండల టాపర్‌గా నిలిచింది. అనంతరం ఇంటర్ బెంగుళూరులోని ఎలైన్ కాలేజీలో చదివింది. నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించింది.

సర్పంచ్ ఫిర్యాదుపై విచారణ



గడేహోతురులోని వాటర్ ప్లాంట్ ఇదే

వజ్రకరూరు: మండల పరిధిలోని గడేహోతురులో మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వాటర్‌ప్లాంట్ తాళాలు పగులగొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సర్పంచ్ కె.సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సిబ్బందితో కలిసి ఎస్ఐ నరేష్ గడేహోతురులో పర్యటించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సురేంద్ర మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వాటర్‌ప్లాంట్ తాళాలు పగులగొట్టారు. అనంతరం వాటర్‌ప్లాంట్‌కు కొత్త తాళాలు వేసి తీసుకెళ్లినట్లు పోలీసులకు వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా వాటర్‌ప్లాంట్‌ను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్‌కు తాళాలు వేయడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.



అనంతపురంలో జోరుగా కురుస్తున్న వర్షం



గొడుగుతో వెళ్తున్న మహిళ

వరుణుడి జోరు..

నగరంలో బుధవారం రాత్రి జోరువాన కురిసింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. చల్లటి గాలులతో వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. రాత్రి 8 గంటల సమయంలో నల్లని మబ్బులు, ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం.. దాదాపు గంట సేపు కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. ద్విచక్ర వాహనదారులు వర్షంలోనే తడుస్తూ ప్రయాణించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



వర్షంలోనే తడుస్తూ వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు



బ్రిడ్జి కింద ఆగిపోయిన మహిళలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



ఆశ్రమంలో మొక్కలు నాటుతున్న అధికారులు, ఆశ్రమవాసులు

అనంతపురం మెడికల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ రజనితో ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విరివిగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఆరోగ్యం శరీరానికే కాదని, పరిసరాలకు కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెడ్‌నర్సులు సైరాభాను, ఉమ, మంగమ్మ, సుకన్య, ఆశాలత, భానులత, స్టాఫ్‌నర్సులు సురేఖ, సుజాత, లత, చాముండేశ్వరి, ఐసీఎస్ రేష్మ, శోభ, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

చెట్లే మానవ జీవితానికి ఆధారం

రాప్తాడు/అనంతపురం కల్చరల్: బొమ్మేపర్తి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా భక్తులతో కలిసి అటవీశాఖ అధికారులు వందలాది మొక్కలను నాటారు. ఆశ్రమ ట్రస్టు, మాతృమండలి సంయుక్తంగా జరిగిన కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మానవ జీవితానికి అత్యంత ఆధారమైన చెట్లను కాపాడుకోవడం విధిగా భావించాలని సూచించారు. రోజు రోజుకు పెరిగిపోతున్న నగరీకరణతో సశ్యశ్యామలమైన అడవులు, చెట్లు కనుమరుగు అవుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు సమాంతరంగా కృషి చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక కేంద్రాలు మానసిక ప్రశాంతనిస్తాయని.. అందుకు ఎంతో నీడను, అందాలనిచ్చే చెట్లు కీలకంగా ఉంటాయన్నారు. స్వామీజీ ఆదేశానుసారం ఆశ్రమాన్ని పచ్చని తోరణంగా మార్చడానికి అందరి సహకారం తీసుకుంటున్నట్లు ఘనపాఠి అమరసింహదత్త, ఆశ్రమ నిర్వాహకుడు కాశీనాథ్ శర్మ తెలిపారు. అంతకు ముందు జయలక్ష్మీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాతృమండలి సభ్యురాలు సుజాత, అటవీశాఖ సిబ్బంది మారెప్ప తదితరులు పాల్గొన్నారు.



కూలిన వందేళ్ల వేపచెట్టు

పావగడ: తాలూకాలోని హొస్సేన్‌పురం గ్రామంలో బుధవారం వందేళ్ల వేప చెట్టు కూలిపోయింది. ఆ చెట్టు పక్కనే ఉన్న ఓ ఇంటిపై కూలిపోవడంతో ఇల్లుపై భాగం దెబ్బతింది. అనంతరం గ్రామస్తులు చెట్టును తొలగించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే వందేళ్లున్న చెట్టు కూలిపోవడం బాధాకరమన్నారు.

రెచ్చగొట్టే చర్యలకు దిగొద్దు



పెద్దవడుగూరులో పర్యటిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: గ్రామాల్లో ఇతరులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడొద్దని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. పెద్దవడుగూరు, మిడుతూరు, చిన్న వడుగూరులో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. ప్రజలు అందరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టినా ఉపేక్షించేది లేదన్నారు.

ఆవు దాడిలో మహిళా రైతుకు గాయాలు



గాయపడిన శివమ్మ

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామంలో బుధవారం ఆవు దాడిలో ఓ మహిళా రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన శివమ్మ తన పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఆవు బెదిరి ఆమెపై దాడి చేసింది. గమనించిన తోటి కూలీలు అపస్మారక స్థితిలో పడి ఉన్న శివమ్మను గమనించి 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు విచారణ చేపట్టారు.

అండర్-19 జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక



అండర్-19 జిల్లా జట్టుకు ఎంపికైన అమూల్య, నందిని

గుంతకల్లు: గుంతకల్లు ఆర్డీటీ క్రికెట్ శిబిరానికి చెందిన బట్నపాడు అమూల్య, బట్నపాడు నందిని (అక్కాచెల్లెలు) అండర్-19 మహిళ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ ఇనయతుల్లా బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రాబబుల్స్ మ్యాచ్‌లో ఇద్దరు మంచి ప్రతిభ కనబరచి ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7 నుంచి 12 వరకు వెంకటగిరిలో జరిగే అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులు అమూల్య, నందినిని క్రికెట్ సంఘం మండల అధ్యక్షుడు ఆర్.హరినాథ్‌గౌడ్, సరోజని నాయుడు మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం సైరాబాను, పీఈటీ మంజువాణీ అభినందించారు. జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

కంది విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

రాయదుర్గం రూరల్: ఖరీఫ్‌లో ప్రత్యేకంగా కంది సాగు లేదంటే వేరుశనగలో అంతర్ పంటగా కందిని సాగు చేసుకోవాలనుకునే రైతులు కంది విత్తనం కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ మహేంద్ర తెలిపారు. రాయదుర్గం మండలంలోని 15 ఆర్బీకేలకు 40 క్వింటాళ్ల ఎల్ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. ఇందులో 74 ఉడేగోళం , ఆవులదట్ల ఆర్బీకేలకు రెండేసి క్వింటాళ్ల చొప్పున, మిగిలిన 13 ఆర్బీకేలకు 3 క్వింటాళ్లు చొప్పున కందివిత్తనాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కందులు బహిరంగ మార్కెట్లో క్వింటాల్ రూ.13,980 కాగా ప్రభుత్వం అందించే రూ.4,194 సబ్సిడీ పోను రైతులు క్వింటాల్ కందులకు రూ.9,786 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రైతులకు ఉచితంగా మొక్కలు

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బీడుభూముల్లో టేకు, వేప, కానుగ, అల్లనేరేడు వంటి మొక్కలను ఉచితంగా అందించనున్నట్లు సంస్థ సీఎస్సీ ప్రతినిధి నరసింహమూర్తి తెలిపారు. ఏడాది పాటు వాటికి నిర్వహణ నిధులు అందజేస్తామన్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు గ్రామాల రైతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అలాగే కర్ణాటకలో సాసులకుంట, కొత్తపల్లి రైతులు సైతం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నకళ్లతో తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొంటే పక్షం రోజుల్లో మొక్కలు అందజేస్తామన్నారు.

నేడు విరామ బైబిల్ పాఠశాల ప్రారంభం

పామిడి: పట్టణ సీఎస్ఐ చర్చిలో గురువారం నుంచి ఈనెల 9వ తేదీ వరకూ నిర్వహించే విరామ బైబిల్ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని చర్చి పాస్టర్ రెవరెండ్ బీవీ విశ్వమోహన్ బుధవారం కోరారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో దైవత్వాన్ని పెంపొందించి వారిని సన్మార్గంలో పయనింప జేయడానికి విరామ బైబిల్‌స్కూల్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న మండలవ్యాప్తంగా గల క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసుల పిల్లలు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి అర్బన్: నందలపాడులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 13న ఉదయం 10 గంటలకు మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక మెరిట్, రోస్టర్ ఆధారంగా జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భూసార ఫలితాల ఆధారంగా పంటల సాగు

కుందుర్పి: మట్టి నమూనాల ఫలితాల ఆధారంగా రైతులు ఖరీఫ్‌లో పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. బుధవారం కుందుర్పిలో రైతులకు మట్టినమూనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించడంతో పాటు రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై సూచనలు సలహాలు అందజేశారు. మండల వ్యాప్తంగా 2,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అందజేశామన్నారు. అంతర పంటలుగా ఉలువ, అలసంద, కంది, ఆముదం వంటి పంటలను సాగు చేస్తే వేరుశనగకు సోకే చీడపీడలను కొద్దిమేర నివారించవచ్చాను. ఇప్పటికే బోరుబావుల కింద రైతులు 198 ఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన లక్ష్మీగణపతిని దేవరాజు అనే వ్యక్తి కట్టెతో దాడి చేశాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివేరకు... లక్ష్మీగణపతి మూడేళ్ల క్రితం పెద్దలను ఎదిరించి కవితను ప్రేమ వివాహం చేసుకున్నాడు. బుధవారం పీఆర్‌టీ వీధిలో నీళ్ల ట్యాంకు వద్దనున్న లక్ష్మీగణపతిని భార్య అన్న అయిన దేవరాజు కట్టెతో దాడి చేశాడు. దాడిలో గాయాలపాలైన లక్ష్మీగణపతిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు దుక్కులే మేలు

- వేసవి దుక్కులతో బోలెడు ప్రయోజనాలు
- భూసార పరీక్షలతో కలుపు, చీడల నివారణ
- ముందు జాగ్రత్తలు తప్పనిసరి
- రాప్తాడు ఏఓ శేఖర్ రెడ్డి



రాప్తాడులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతన్న

రాప్తాడు: వేసవి దుక్కులతో రైతన్నకు అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఉపయోగకరమైన సూక్ష్మ జీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. తద్వారా భూసారం అభివృద్ధి చెందుతుంది. అంతేకాక కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చు. పంటల సాగు పూర్తయ్యాక రైతులు తమ వ్యవసాయ భూములను అలాగే వదిలేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కలుపు మొక్కలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అవి భూమిలోని పోషకాలు స్వీకరించడమే కాకుండా భూమిలో లోతైన పొరల నుంచి నీటిని లాగేస్తాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతినే అవకాశం ఉంది.

పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించడానికి రైతులు రబీ పంటలు చేతికందగానే దుక్కలను దున్ని భూములను ఆరబెట్టాలని రాప్తాడు వ్యవసాయాధికారి శేఖర్ రెడ్డి సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అధిక ప్రయోజనాలుంటాయని, సమగ్ర సస్యరక్షణలో వేసవి దుక్కులు చాలా ఉపయోగపడతాయని చెప్పారు.

కలుపు మొక్కల నివారణ..

భూముల్లో ఏ పంట వేయకుండా ఉంచితే కలుపు మొక్కలు పెరిగి భూసారానికి నష్టం కలుగజేయడంతో పాటు చీడపీడలకు ఆశ్రయం కల్పిస్తాయి. మొండి జాతికి చెందిన తుంగ అన్ని రకాల భూముల్లోనూ ఎదుగుతుంది. బహు వార్షిక వేర్లలో ఆహారాన్ని నిల్వ చేసుకుని భూసారాన్ని దెబ్బతీస్తుంది. వేసవిలో లోతైన దుక్కులు దున్నడం వల్ల వీటిని నివారించవచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడం వల్ల పంటలను ఆశించే చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు దున్నడం వల్ల వేరుశనగ, పత్తి, కంది, చెరకు, పండ్ల తోటలను ఆశించే లద్దె పురుగు, బొంత పురుగు, పువ్వ పురుగు, దాసరి పురుగు, భూమి పొరల్లో దాగిన చీడ పురుగుల గుడ్లు, కోశాలు వెలుపలికి వచ్చి బయటి ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయటపడిన ప్యూపాలు, గుండ్లను కొంగలు, పక్షులు తినడంతో పంటలకు చీడ పురుగుల బాధ తప్పుతుంది

తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది..

వర్షాకాలం రాక ముందే భూమిని మూడు దుక్కులు దున్నాలి. ఇలా చేయడం వల్ల తొలకరి వర్షాలకు నేల మెత్తబడి నీళ్ల భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుగా అడ్డంగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్ల చేసే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించవచ్చు. దుక్కలు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి. దీంతో భూమి సారవంతం అవడమే కాకుండా తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. భూములను వృథాగా వదిలి వేయడం వల్ల పొరలు గట్టి పడతాయి. పంటలు వేసిన సమయంలో నారు సరిగ్గా చొచ్చుకునిపోదు. దీంతో పోషక పదార్థాలు సరిగా అందక మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుంది. వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల భూమి గుల్లగా మారుతుంది. భూమిలో నీటి నిల్ల సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాములు సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార అభివృద్ధికి తోడ్పడతాయి.

ఖర్చు తగ్గించుకోండి ఇలా..

కేవలం ఒక పంటకు అరవై వేల ఖర్చు పెట్టడం కన్నా చక్కటి యాజమాన్య పద్ధతులతో సాగుకయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. సాగుకు ముందే భూసారాన్ని పరీక్షించి లోపాలుంటే వాటికి అవసరమయ్యే సూక్ష్మ పోషకాలను సూచనల మేరకు వేయాల్సి ఉంటుంది. చీడపీడల నివారణ కోసం రూ.వేలు ఖర్చు చేయకుండా వేపనూనె, పంచగవ్య, ఎర పంటలను సాగు చేసి తెగుళ్లు సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టవచ్చు. వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని నీటిని పారించే పద్ధతి కన్నా బిందు సేద్యం అవలంభించాలి.

తహసీల్దార్ కారు బోల్తా

- సురక్షితంగా బయటపడిన డ్రైవర్



శింగనమల: బుక్కరాయసముద్రం సమీపంలోని అనంత విద్యానికేతన్ వద్ద కారుఅదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు..శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మొహన్‌బాబును వదిలి, పని మీద డ్రైవరు మాత్సుపాల్ కారు తీసుకెళ్లారు. పని ముగించుకొని అనంతపురం నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డ్రైవరుకు ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం దెబ్బతింది.